క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సమస్యలతో పాటు సూచనలు, సలహాలు స్వీకరించేందుకు సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రయాణికులు సెల్ నంబర్ 99592 25532కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలపాలని కోరారు.

సైకిల్ షెడ్డు ప్రారంభం



బొద్దవరం హైస్కూల్‌లో సైకిల్ షెడ్డును ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

కోటనందూరు: మండలంలోని బొద్దవరం హైస్కూల్‌లో తుని రోటరీ క్లబ్ ప్రతినిధులు రూ.లక్షతో నిర్మించిన సైకిల్ షెడ్డును శుక్రవారం గ్రామ సర్పంచ్ వేగి లక్ష్మి ప్రారంభించారు. గతంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు పర్యటన సందర్భంగా పాఠశాల యాజమాన్యం సైకిల్ షెడ్డు నిర్మించాలని రోటరీ ప్రతినిధులను కోరింది. దీంతో రోటరీ క్లబ్ ప్రతినిధులు సైకిల్ షెడ్డు నిర్మించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేగి అప్పలనాయుడు, దొడ్డి బాబ్జీ, పీఏసీఎస్ చైర్మన్ సూర్యసత్యనారాయణ, యల్లపు దొరబాబు, హెచ్ఎం సీహెచ్ వెంకటరమణ, రోటరీ అధ్యక్షుడు కేఎస్ఎల్ఎస్ వర్మ తదితులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో పేదలకు మేలు



సమవేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. ఆ పార్టీ నియోజకవర్గ నేత ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. ఉజ్వల పథకంలో మహిళలకు ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



ఏలేశ్వరంలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: నియోజవర్గంలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో విద్యార్థులు స్వేచ్ఛగా పరీక్షలు రాశారు. పట్టణంలో చివరిరోజు పరీక్షలకు 528 మంది విద్యార్థులకు గాను 16 మంది విద్యార్థులు గైర్హజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 259 విద్యార్థులకు గాను 250 మంది, గురుకుల కళాశాలలో 269 మంది విద్యార్థులకు గాను 262 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్షలు పూర్తికావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

22 మంది పరీక్షలకు గైర్హాజరు

కిర్లంపూడి: ఇంటర్మీడియెట్ పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సెకండియర్ పరీక్షలకు 22 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ కె. ఉషామాధురి తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాల్లో 711 మందికి గాను 689 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు వివరించారు.

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు



పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిర్మాణాలు చకచకా.. సేవలు పక్కా..

- గ్రామాల్లో జోరుగా ప్రభుత్వ భవనాల నిర్మాణాలు
- నియోజకవర్గంలో రూ.50.13 కోట్లతో పనులు
- ఇప్పటికే 63 భవనాలు ప్రారంభం



టి.వెంకటాపురంలో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకేలు

తుని రూరల్: గ్రామాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం వివిధ గ్రాంట్లు మంజూరు చేయడంతో పలు విభాగాలకు సంబంధించి సొంతభవనాలు నిర్మిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. గ్రామీణుల అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆయా గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లు (హెల్త్ క్లీనిక్‌లు) పెద్ద ఎత్తున నిర్మిస్తోంది. దీనిలో భాగంగా తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో రూ.50.13 కోట్లతో 180 భవనాలు నిర్మించాలని తలపెట్టింది. ఇప్పటికే 63 భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించడంతో ఆయా కార్యాలయాల్లో ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. మిగిలిన భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులు పెరగడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భవనం పేరు	మంజూరైన భవనాలు	పూర్తయిన భవనాలు	నిధులు (రూ.కోట్లలో)
గ్రామ సచివాలయాలు	67	37	రూ.26.05
రైతు భరోసా కేంద్రాలు	58	19	రూ.13.94
వెల్‌నెస్ సెంటర్లు	55	7	రూ.10.14
మొత్తం	180	63	రూ.50.13



టి.వెంకటాపురంలో వైద్యసేవలు అందిస్తున్న వెల్‌నెస్ సెంటర్

నాడు కష్టాలు.. నేడు మెరుగైన సేవలు

గత ప్రభుత్వాల హయాంలో అరకొరగా ఉన్న పంచాయతీ భవనాల్లో పరిమితంగా ప్రజా సేవలు అందించేవారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ రూ.40 లక్షల నుంచి రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాయాల ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. గతంలో వ్యవసాయ సంబంధిత సేవలకు రైతులు మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు రైతులకు సొంతూళ్లలోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, మెరుగైన సేవలు అందిస్తున్నారు. గ్రామాల్లో ఒక్కొక్క ఆర్‌బీకేను రూ.21.50 లక్షలతో నిర్మిస్తున్నారు. గతంలో వైద్యసేవలు పొందాలంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తుని పట్టణంలో ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. రూ.18.50 లక్షలు చొప్పున వెచ్చించి ఒక్కొక్క వెల్‌నెస్ సెంటర్‌కు సొంతభవనాలు నిర్మిస్తున్నారు.

కొత్త పంచాయతీకి కొత్త భవనాలు



గతంలో వి.కొత్తూరు పంచాయతీలో కలసి ఉన్న మా లోవకొత్తూరు గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశారు. మొదట్లో అద్దె భవనంలో పంచాయతీ కార్యకలాపాలు సాగించారు. తదనంతరం రూ.43.60 లక్షలతో సచివాలయ భవనం నిర్మించడంతో ప్రభుత్వ సేవలన్నీ గ్రామంలోనే పొందుతున్నాం.

– లంక కృపానందం, లోవకొత్తూరు

సొంతూరులోనే వైద్య సేవలు



నాలుగేళ్ల కిందట వైద్యసేవలు పొందాలంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, తునిలో ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా గ్రామంలో వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేశారు. వైద్యులు అందుబాటులో ఉండడంతో సొంతూరులోనే వైద్య సేవలు, ఉచితంగా మందులు అందుతున్నాయి.

– పప్పు వెంకటరమణ, టి.వెంకటాపురం

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



తునిలో లబ్ధిదారులకు చేయూత నమూనా చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

తుని రూరల్: మహిళలను ఆర్థికంగా శక్తివంతులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మండలంలోని 6993 మంది లబ్ధిదారులకు రూ.13.11 కోట్ల విలువైన నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ నిధులు ఎంతగానే ఉపయోగపడతాయన్నారు. ఆర్థిక భరోసాతోనే ఆయా కుటుంబాలు ఆర్థికాభివృద్ధిని సాధిస్తాయన్నారు. మహిళల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాను వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, నాయకులు చిటికెల వరహాలబాబు, ఏపీఎం వై.సత్తిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట



తుని మున్సిపల్ కార్యాలయంలో ఏపీఎంఎంఈఏ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా

తుని: ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీఎంఎంఈఏ) డైరీని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు సమ్మె కాలంలో పెట్టిన కేసులను ఎత్తివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, రెవెన్యూ అధికారి సాల్మన్‌రాజు, శివాజీ, ఏపీఎంఎంఈఏ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం

- ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- ఏలేశ్వరంలో గడప గడపకూ ...

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీకి మళ్లీ పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. పట్టణ పరిధిలోని 14, 15, 16 వార్డుల్లో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. ప్రజల మద్దతు ఉన్న సీఎం జగన్ మళ్లీ గద్దెనెక్కడం ఖాయమన్నారు. అనంతరం జగనన్న కాలనీలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్, దళే కిషోర్, పైల విజయ్‌కుమార్, దాకమర్రి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల

ముస్లింలకు ఇఫ్తార్ విందు

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ముస్లింలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు శుక్రవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక మార్కెట్ వీధిలోని మసీదులో ఇఫ్తార్ విందు జరిగింది. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం జగన్ ముస్లింల పక్షపాతిగా పేరుపొందారన్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం ఇఫ్తార్ విందులో పాల్గొన్న కో ఆర్డినేటర్ వరుపుల

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి



వీరవరంలో తోట నరసింహానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆలయ ధర్మకర్తల మండలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట

గండేపల్లి: మురారిలోని రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సూచించారు. రామలింగేశ్వరస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి సభ్యులు శుక్రవారం కిర్లంపూడి మండలంలోని వీరవరంలో తోట నరసింహాన్ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఆలయ చైర్మన్ మావిరెడ్డి వీరభద్రరావు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, తోట అయ్యన్న, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు మరో అవకాశం ఇవ్వండి

- మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- తునిలో ఎన్నికల ప్రచారం

తుని: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు, యువనేత దాడిశెట్టి శంకర్ మల్లిక్ పిలుపునిచ్చారు. తుని 7వ వార్డులో శుక్రవారం పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా శంకర్ మల్లిక్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకుడు అని, అటువంటి నేతను మనమంతా మళ్లీ ఓటు ద్వారా గెలిపించుకోవాలన్నారు. తుని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ పరుగులు పెట్టించిన మంత్రి దాడిశెట్టి రాజాకు మద్దతుగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ అల్లాడ దివాణం, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, కౌన్సిలర్ రేలంగి విజయదుర్గ, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



తునిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న శంకర్ మల్లిక్, నాయకులు

గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాల కవాతు

శంఖవరం: మండలంలోని కత్తిపూడి, పెదమల్లాపురం, శంఖవరం గ్రామాల్లో శుక్రవారం కేంద్ర పోలీసు బలగాలతో భారీ కవాతు నిర్వహించారు. స్థానిక సీఐ కె.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించి ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శేఖర్‌బాబు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగా గ్రామాల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అన్నవరం ఎస్సై వి.కిషోర్ కుమార్, ఏఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కత్తిపూడిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర రక్షణ బలగాలు

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం



తిరుమాలిలో ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు



జగపతినగరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాంబాబు నాయక్



జగ్గంపేటలో ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని తిరుమాలిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం వరుపుల సుబ్బారావు ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యురాలు శ్రీలక్ష్మి గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సూతి ప్రసాద్, ఓలేటి చంటిబాబు, పసల నాగేశ్వరరావు, కోరుకొండ రామకృష్ణ, అడపా పార్థసారథి, సామంతుల చిన్నారావు, యిజనగిరి ప్రసాద్, బేరి అరవిందకుమార్, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగపతినగరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

కిర్లంపూడి: స్థానిక జగపతినగరం పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు బి.రాంబాబు నాయక్, శశి రేఖ, నాగేశ్వరావు, రంజని సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కోసం పలువురుని పెద్దాసుపత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలు ఆరోగ్యశ్రీ, సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



గోకవరంలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

గోకవరం: మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను శుక్రవారం నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు పరిశీలించారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన వసతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్సై కె.నాగరాజుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు ముష్టి పురుషోత్తం, ప్రయాగ రాంబాబు, ఫణిశర్మ, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. దేవస్థానం సూపరింటిండెంట్ ఐవీ రామారావుతో పాటు 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

సామర్లకోట: జిల్లా మహిళా సమాఖ్య సభ్యుల నుంచి ఎంపికైన సభ్యులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీ రమణి అన్నారు. స్థానిక టీటీడీసీలో జిల్లాలోని ప్రతి మండలం నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేసిన ప్రతినిధులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ముగింపు సందర్భంగా శుక్రవారం ఆమె పాల్గొన్నారు. శిక్షణ పొందిన మహిళా ప్రతినిధులు ఆయా మండలాలకు వెళ్లి రైతుల్లో అవగాహన పెంచాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పంట పొలాలు సందర్శించి తెలుసుకున్న విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సెర్ప్ డీపీఎం కేశవ్ ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఎలియాజర్, ఆర్పీలు అప్పలనాయుడు, గణేష్ పాల్గొన్నారు.